క్లుప్తంగా

జిల్లాస్థాయి కబడ్డీ పోటీల విజేత రాచపల్లి జట్టు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఏలేశ్వరం: మండలంలోని కొత్తయర్రవరంలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో రాచపల్లి జట్టు విజేతగా నిలిచింది. ఐదురోజుల పాటు నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో 20 జట్లు పాల్గొన్నాయి. వీటిలో రాచపల్లి జట్టు ప్రథమ స్థానం, మల్లేపల్లి జట్టు ద్వితీయ స్థానం, కోలంక జట్టు తృతీయస్థానం సాధించాయి. హోరాహోరీగా సాగిన పోటీలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. విజేతలకు స్థానిక నేతలు మైరాల కనకరావు, బస్వా ప్రసాద్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆకుల నాని, కోన సూరిబాబు, అడపా వినయ్, చింత అశోక్, గంగిరెడ్ల మణికంఠ, తోట వెంకటేశ్వరరావు, గంగిరెడ్ల చిన్నా తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానాలు

తుని: పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 12 మందికి తుని ప్రిన్సిపల్ కోర్టు న్యాయమూర్తి జరిమానా విధించారని సీఐ గీతా రామకృష్ణ శుక్రవారం తెలిపారు. మద్యం సేవించి ద్విచక్రవాహనాలు నడిపిన 12 మందికి ఒక్కొరికి రూ.10 వేలు చొప్పున రూ.1.20 లక్షలు ఫైన్ వేశారన్నారు. వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపవద్దని సూచించారు.

కోటనందూరులో నలుగురికి..

కోటనందూరు: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన నలుగురికి కోర్టు రూ.10 వేల చొప్పున జరిమానా విధించినట్లు స్థానిక ఎస్సై రామకృష్ణ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా జడ్జి పైవిధంగా జరిమానా విధించిట్లు ఎస్సై తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం

గండేపల్లి: పదహారో నంబర్ జాతీయ రహదారిపై మండలంలోని జెడ్.రాగంపేట ఆదిత్య హాస్పిటల్ వద్ద శుక్రవారం జరిగిన ప్రమాదంలో పెను ప్రమాదం తప్పింది. హైవే పెట్రోలింగ్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం...రాజమహేంద్రవరం వైపు నుంచి విశాఖ వైపు వెళుతున్న హైషర్ వ్యాన్‌ను ఆదిత్య హాస్పిటల్ సమీపంలో సర్వీస్ రోడ్ నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. వాహనాలు దెబ్బతిన్నాయి.

7 నుంచి విద్యార్థులకు బస్సు పాసులు

తుని: ఏపీఎస్ఆర్టీసీ ఈ నెల 7వ తేదీ నుంచి విద్యార్థులకు బస్సు పాస్‌లు జారీ చేస్తున్నట్టు తుని ఆర్టీసీ డిపో మేనేజర్ కిరణ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీఎస్ఆర్టీసీ వెబ్‌సైట్ ఆధునీకరణలో భాగంగా శనివారం, ఆదివారం బస్ పాస్‌లు జారీని తాత్కాలికంగా నిలిపి వేస్తున్నామన్నారు. 7 నుంచి యథావిధిగా బస్‌పాస్ కౌంటర్ల నుంచి పొందవచ్చున్నారు. ప్రయాణికులు, విద్యార్థులు విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఆర్టీసీ కార్మికుల ఆందోళన



ఏలేశ్వరం ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

ఏలేశ్వరం: స్థానిక ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న కండక్టర్‌ను అక్రమంగా సస్పెండ్ చేశారంటూ పట్టణంలో గురువారం ఆర్టీసీ కార్మికులు రిలే దీక్షలు చేశారు. ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా అమలు చేయని సర్క్యులర్ తీసుకువచ్చి డిపో మేనేజర్ నిరంకుశత్వంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. హెడ్ ఆఫీసు జాబ్ సెక్యూరిటీ గైడ్‌లైన్సు పాటించకుండా కండక్టర్ ఎస్ఎస్ రావు (నల్లశ్రీను)ను సస్పెండ్ చేయడం దారుణమన్నారు. అతన్ని విధుల్లోకి తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.మాణిక్యం, కె.త్రిమూర్తులు, ఎన్‌పీరావు, నానిబాబు, చలం తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి సందడి షురూ..

- రత్నగిరిపై వివాహాలు ప్రారంభం
- మూడు నెలలు శుభ ముహూర్తాలు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం దేవస్థానం నవ దంపతులతో కళకళలాడుతోంది. దసరా వేడుకలతో ప్రారంభమయ్యే ఆశ్వీయుజ మాసం నుంచి మూడు నెలలు వివాహాది శుభ కార్యాలు జరుగనున్నాయి. సుమారు నెల రోజుల విరామం అనంతరం శుక్రవారం నుంచి వివాహాలు మొదలవ్వడంతో సత్రం గదులు, వివాహ మండపాలు అద్దెకిచ్చే సీఆర్వో కార్యాలయం వద్ద, ఉచిత కల్యాణ మండపాల వద్ద పెళ్లి బృందాల సందడి మొదలైంది. సత్రం గదులు, కల్యాణ మండపాల రిజర్వేషన్ కోసం దేవస్థానంలోని సీఆర్వో ఆఫీస్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. నెల రోజుల ముందు నుంచీ వివాహ మండపాలు, సత్రం గదుల రిజర్వేషన్ ప్రారంభమైంది. ఒక వేళ నెల ముందుగా సత్రం గదులు, మండపాలను ఎవరు రిజర్వ్ చేసుకోకపోతే ఆ తరువాత వచ్చే వారికి వాటిని కేటాయిస్తారు. అదే విధంగా క్యాటరింగ్, పురోహితులు, సన్నాయి మేళాలకు గిరాకీ పెరిగింది.

సుమారు 500 వివాహాలకు అవకాశం

ఆశ్వీయుజ మాసం శుక్రవారం నుంచి, మార్గశీర్ష మాసంలో డిసెంబర్ 12 వరకూ గల వివాహాల సీజన్‌లో సుమారు 500 పెళ్లిళ్లు జరిగే అవకాశం ఉందని దేవస్థానం అధికారులు అంచనా వేస్తున్నారు. సత్యగిరిపై ఎంఎస్ రెడ్డి అంజనీ వివాహ వేదిక, శ్రీసత్య శ్రీనివాస ఉచిత ఏసీ కల్యాణ మండపాల్లో ఉన్న 24 ఉచిత కల్యాణ మండపాలు పేద, మధ్యతరగతి వారి వివాహాలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఇప్పటికే ఇవి చాలా ముహూర్తాలకు రిజర్వ్ అయ్యాయి. ఈ రెండు మండపాల్లో ఏకకాలంలో 24 వివాహాలు జరిగే అవకాశం ఉంది. ఆరు గంటల వ్యవధిలో రెండు ముహూర్తాలు ఉంటే ఒకే రోజు కల్యాణ మండపంలో రెండేసి వివాహాల చొప్పున 48 వివాహాలు కూడా ఇక్కడ జరుగుతున్నాయి. తెల్లరేషన్ కార్డు ఉన్న వారు మాత్రమే ఇక్కడ వివాహాలు చేసుకునే వీలుంది. అయితే ఏ విధమైన రుసుం చెల్లించే అవసరం లేదు. పైగా పెళ్లిపీటలు, కురీ్చలు తదితర సామగ్రి ఆ కల్యాణ మండపాల దాతలు సమకూర్చుతుండడం విశేషం. వివాహాల కోసం సత్రాల్లో 60 శాతం వరకు గదులను పెళ్లి బృందాలకు అధికారులు రిజర్వ్ చేస్తున్నారు. మిగిలిన గదులను మాత్రమే సాధారణ భక్తులకు కేటాయిస్తున్నారు.



ఎంఎస్‌రెడ్డి అంజనీ ఉచిత వివాహ వేదిక

కన్నులపండువగా బోనాల సంబరం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఇ.గోకవరంలో దేవీ నవరాత్రులను పురస్కరించుకొని సాంస్కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం బోనాల సంబరం నిర్వహించారు. స్థానిక గిరిజనులు బోనాలతో అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. అనంతరం స్థానిక కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి బోనాలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

ఘనంగా లక్షపత్రి పూజ

కిర్లంపూడి: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా కిర్లంపూడి ఏనుగువీధి రామాలయం వద్ద కనకదుర్గమ్మ వారికి శుక్రవారం లక్షపత్రి పూజ నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాల నుంచి వందలాదిగా భవనీ భక్తులు తరలివచ్చి పూజలో పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ ఏర్పాట్లు చేశారు. జగపతినగరంలో వేంచేసిన అభయ దుర్గమ్మ, కిర్లంపూడి వేంచేసిన వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. కిర్లంపూడి శివారున వేంచేసిన వన దుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు.



ప్రత్తిపాడులో కలశాలతో పురప్రదర్శన చేస్తున్న భవానీ భక్తులు

ప్రత్తిపాడులో కలశ పూజ

ప్రత్తిపాడు: శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా ప్రత్తిపాడులో శుక్రవారం భవానీ భక్తులు కలశపూజలు నిర్వహించారు. స్థానిక శివాలయం వద్ద గల దుర్గాదేవి ఆలయంలో భవానీ మాలధారులు అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం కలశాలు శిరస్సున దాల్చి పుర ప్రదర్శన నిర్వహించారు.

అగ్నిగుండంలో నడచిన భక్తులు

స్థానిక దుర్గాదేవి ఆలయం వద్ద శుక్రవారం రాత్రి అగ్నిగుండం ఏర్పాటు చేశారు. అమ్మవారి కలశాలు శిరస్సున ధరించిన భవానీ భక్తులు అగ్నిగుండంలో మూడుసార్లు నడిచి, భక్తిని చాటుకున్నారు. అగ్నిగుండ కార్యక్రమాన్ని తిలకించేందుకు సమీప గ్రామా లనుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

లక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవార్లు



గాయత్రీదేవి అలంకరణలో తలుపులమ్మ అమ్మవారు



రత్నగిరిపై లక్ష్మీదేవి అలంకరణలో కనకదుర్గ అమ్మవారు



లక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన రత్నగిరి వనదుర్గ అమ్మవారు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో శరన్నవరాత్ర ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు శుక్రవారం రత్నగిరి కనకదుర్గ, వనదుర్గ అమ్మవార్లు సిరులొసంగే లక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

దసరా వేడుకల సందర్భంగా రత్నగిరిపై అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి, కనకదుర్గ, వనదుర్గ అమ్మవార్లకు శుక్రవారం పండితులు ప్రత్యేక పూజలు చేశారు. దర్బారు మండపంలో ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకు రుత్విక్కులు శ్రీసూక్త, పురుషసూక్త, మన్యుసూక్త పారాయణలు, లలితా, విష్ణు సహస్రనామావళి పారాయణ చేశారు. అలాగే లింగార్చన, నవావరణ అర్చన, సూర్యనమస్కారాలు నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటల వరకూ సత్యదేవుని ప్రధానాలయంతో పాటు వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్ల ఆలయాల్లో రుత్విక్కులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గాయత్రీదేవి తలుపులమ్మ అమ్మవారు

తుని రూరల్: శరన్నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని లోవ దేవస్థానంలో కొలువైన తలుపులమ్మ అమ్మవారు శుక్రవారం గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పార్వతీదేవి అలంకరణలో..

తొండంగి: దసరా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గోపాలపట్నం గ్రామదేవత నేరేళ్లమ్మ అమ్మవారు పార్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

దుర్గాదేవి అలంకరణలో ..

ప్రత్తిపాడు రూరల్: రాచపల్లి అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో కొలువైన అపిత కుచాంబ అమ్మవారు, ధర్మవరంలో విజయదుర్గా అమ్మవారు, ఒమ్మంగి కనకదుర్గమ్మ అమ్మవారు శుక్రవారం గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని రాచపల్లి, పెద్దిపాలెం, ఉత్తరకంచి, శరభవరం, గజ్జనపూడి, పోతులూరు తదితర గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు.

గాయత్రీదేవిగా కనకదుర్గమ్మ

కోటనందూరు: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా మండలంలోని కాకరాపల్లిలో వేంచేసిన కనకదుర్గమ్మ శుక్రవారం గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

బాలాత్రిపుర సుందరీదేవిగా అమ్మవారు

ఏలేశ్వరం: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం దుర్గాదేవి అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని తోటవీధి, దిబ్బలపాలెం సంతోషిమాత ఆలయం, సువ్వయ్యమ్మపేట, నర్సీపట్నం రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో దసరా వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఉదయం, సాయంత్రం ఆలయాల వద్ద కుంకుమ పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో భక్తులు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.



ఏలేశ్వరంలో బాలాత్రిపుర సుందరీదేవిగా అమ్మవారు



కాకరాపల్లిలో గాయత్రీదేవిగా దర్శనమిస్తున్న కనకదుర్గమ్మ



గోపాలపట్నంలో పార్వతీదేవి అలంకరణలో..

స్వచ్ఛ భారత్‌పై అవగాహన

ఏలేశ్వరం: ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటించడం ద్వారా రోగాలు దరిచేరవని నగర పంచాయతీ కమిషనర్ ఎం.సత్యనారాయణ అన్నారు. స్థానిక 16వ వార్డులో శుక్రవారం గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛభారత్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ జ్వరాలు ఎక్కువగా ఉన్నందున ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇళ్ల మధ్య నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.



16వ వార్డులో స్వచ్ఛ భారత్‌పై అవగాహన కల్పిస్తున్న కమిషనర్ సత్యనారాయణ

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని గౌరంపేట సర్పంచ్ రామిశెట్టి ఏసుబాబు అన్నారు. మండలంలోని గౌరంపేటలో శుక్రవారం పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీయించారు. గ్రామం నలుమూలల బ్లీచింగ్ చల్లారు. దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఏసుబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.



గౌరంపేటలో జేసీబీతో వ్యర్థాల తొలగింపు

ప్రత్తిపాడు జేఈగా సత్య ప్రకాష్ బాధ్యతల స్వీకరణ



ప్రత్తిపాడు: మండల పంచాయతీ రాజ్ జేఈగా ఎం.సత్యప్రకాష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఇక్కడ పని చేసిన ఎన్.నాగేశ్వరరావు కృష్ణా జిల్లా అగిరిపల్లి మండల జేఈగా బదిలీపై వెళ్లారు. జేఈగా బాధ్యతలు స్వీకరించిన సత్యపకాష్‌కు ఎంపీపీ గోర్ల కాంతిసుధాకర్, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది మూర్తి, సురేష్, రత్నం తదితరులు స్వాగతం పలికారు. కాగా మరో ఇద్దరు కార్యదర్శులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గొల్లప్రోలు మండలం కొడవలి పంచాయతీ కార్యదర్శి నాగమణి మండలంలోని పోతులూరు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా, ప్రత్తిపాడు మండలం వెంకటనగం గ్రామ పంచాయతీ కార్యదర్శి భవానీ ఏలూరు గ్రామ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న లారీ సీజ్

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామ శివారున పోలవరం కాలువ గట్టు నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్టు గోకవరం తహసీల్దార్ సరస్వతి శుక్రవారం తెలిపారు. గురువారం రాత్రి సమయంలో కాలువ గట్టు మట్టిని అక్రమంగా తరలిస్తున్న లారీని గ్రామ వీఆర్వో లంకా అప్పారావు, వీఆర్ఏ రామకృష్ణ అడ్డుకున్నారన్నారు. అనుమతులు లేకుండా మట్టిని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.



సీజ్ చేసిన లారీతో రెవెన్యూ సిబ్బంది

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు సంతోష్, గంగాధరబట్ల శర్మ, కోట వంశీ చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, మరో 40 మంది భక్తులు హోమంలో పాల్గొన్నారు.

కార్తికమాస ఏర్పాట్లపై నేడు సమీక్ష

అన్నవరం: వచ్చేనెల రెండో తేదీ నుంచి డిసెంబర్ ఒకటో తేదీ వరకు సాగనున్న కార్తికమాసంలో రత్నగిరిపై తీసుకోవాల్సిన చర్యలపై శనివారం సమీక్షించనున్నారు. భక్తుల సౌకర్యాలు, వసతులపై దేవస్థానంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై సిబ్బందితో ఈఓ కె.రామచంద్రమోహన్ సమావేశం ఏర్పాటు చేశారు. గత ఏడాది చేపట్టిన ఏర్పాట్లపై విభాగాల వారీగా నివేదికలతో హాజరు కావాలని అధికారులను ఈఓ ఆదేశించారు. అనంతరం జిల్లా స్థాయి అధికారులతో కార్తిక మాస ఏర్పాట్లపై సమన్వయ సమావేశం ఏర్పాటు చేయనున్నారు. కాగా, శనివారం జరిగే సమావేశంలో దేవస్థానంలోని అన్ని విభాగాల ఏఈఓ, సూపరింటెండెంట్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, దేవస్థానం వైద్యాధికారి తదితరులు హాజరుకావాలని ఆదేశించారు.

ముగిసిన ఆన్‌లైన్ సర్టిఫికేషన్ ప్రోగ్రాం

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో గత పది రోజులుగా నిర్వహిస్తున్న డేటా విజువలైజేషన్ విత్ పవర్ బీఐ, టేబ్లూ ఆన్‌లైన్ సర్టిఫికేషన్ ప్రోగ్రాం శుక్రవారంతో ముగిసినట్టు డిప్యూటీ చాన్స్‌లర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఏఐఎంఎల్ విభాగం ఆధ్వర్యంలో అనుభవజ్ఞులైన రిసోర్స్‌పర్సన్లు పాఠ్యాంశాలను బోధించినట్టు చెప్పారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ఎంబీ శ్రీనివాస్, ఎస్.రమాశ్రీ, జి.సురేష్, ఐ.వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రం ప్రారంభం



కొత్తపేటలో రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ తోట రవి

కిర్లంపూడి: గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ తోట రవి సూచించారు. కొత్తపేటలో నూతనంగా నిర్మించిన రైతు సేవా కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత, మండల వ్యవసాయశాఖ అధికారి జోకా అమృత, కుర్ల చినబాబు, చదరం చంటిబాబు, కురుమళ్ల చిన్ని, రైతులు, వీపీఏలు పాల్గొన్నారు.

ముగిసిన అంతర్రాష్ట్ర క్రీడా పోటీలు



అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీల్లో విజేతలకు ట్రోఫీని అందజేస్తోన్న హోంమంత్రి వంగలపూడి అనిత

తుని: స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థల్లో మూడు రోజుల పాటు జరిగిన అంతర్రాష్ట్ర కబడ్డీ, వాలీబాల్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఆంధ్ర–తెలంగాణ రాష్ట్రాల్లోని 100 విద్యాసంస్థలకు చెందిన 1200 మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభను కనబరిచారు. సీబీఎస్‌ఈ క్లస్టర్–7లో అండర్–14, 17, 19 విభాగాల్లో బాలికలు కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో సత్తా చాటారు. విజేతలకు రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత చాంపియన్ షిప్ ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడలశాఖ మాజీ అధికారి సూర్యారావు, శ్రీప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్, రెండు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు, కోచ్‌లు, తల్లిదండ్రులు, తుని, పాయకరావుపేట పట్టణాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

విజేతలు వీరే

కబడ్డీ అండర్–14లో ప్రథమ స్థానం శ్రీప్రకాష్ విద్యానికేతిన్ (పాయకరావుపేట, అనకాపల్లి జిల్లా, ఏపీ), ద్వితీయ స్థానం న్యూ డైమన్షన్ హైస్కూల్, (భువనగిరి, యద్రాది భువనగిరి జిల్లా, తెలంగాణ) కబడ్డీ అండర్–17 విభాగంలో ప్రథమ స్థానంలో హీల్ స్కూల్, (నరిసింగపాలెం, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్), ద్వితీయ స్థానంలో ప్రబోదానంద ప్రశాంతి నికేతన్ (కొండాపూర్, మేడ్చల్ జిల్లా, తెలంగాణ)

- కబడ్డీ–19 విభాగంలో ప్రథమ స్థానం హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్ (ఖమ్మం, ఖమ్మం జిల్లా, తెలంగాణ), ద్వితీయ స్థానం ది హార్ట్‌ఫుల్ లెర్నింగ్ సెంటర్ (హైదరాబాద్, తెలంగాణ)
- వాలీబాల్ అండర్–14 విభాగంలో ప్రథమ స్థానం సంఘమిత్ర హైస్కూల్ (నిజాంపేట్, కూకట్‌పల్లి, మేడ్చల్ జిల్లా, తెలంగాణ), ద్వితీయ స్థానంలో డీఏవీ పబ్లిక్ స్కూల్ (కూకట్‌పల్లి, మేడ్చల్ జిల్లా, తెలంగాణ)
- వాలీబాల్ అండర్–17లో ప్రథమ స్థానం నవనీత్ పబ్లిక్ స్కూల్ (నెల్లూరు, నెల్లూరు జిల్లా, ఏపీ), ద్వితీయ స్థానం మాంటిస్సోరి ఎలైట్ స్కూల్ (అనంతపురం, అనంతపురం జిల్లా, ఏపీ)

వాలీబాల్ అండర్–19 విభాగంలో డీపీఎస్ పబ్లిక్ స్కూల్ (నాచారం, మేడ్చల్ జిల్లా, తెలంగాణ), ద్వితీయ స్థానం అక్షర విద్యాలయం (నెల్లూరు, నెల్లూరు జిల్లా, ఏపీ)

చినుకు పడితే చిత్తడే

- వర్షం వస్తే చెరువులను తలపిస్తున్న రోడ్లు
- కాలువల నిర్మాణంలో ముందుచూపు లేక దుస్థితి
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

తుని: చిన్నపాటి వర్షం పడితే చాలు పట్టణంలోని రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. ఎక్కడికక్కడ రహదారులపై నీరు నిల్వ ఉండిపోతోంది. ఆయా రోడ్లపై రాకపోకలు సాగించేందుకు ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ఇంజినీరింగ్ శాఖ అధికారులు నిర్మాణాల విషయంలో లెవెల్స్ పాటించకపోవడం వలనే ముంపు సమస్య తలెత్తుతోందని పలువురు ఆరోపిస్తున్నారు.

పలు ప్రాంతాల్లో..

పట్టణంలోని జీఎస్‌టీ రోడ్డు, ప్రకాశం రోడ్డు, బాలాజీ రోడ్డు, సాయినగర్, జీడిపిక్కల ఫ్యాక్టరీ, రైల్వే అండర్ పాస్ తదితర ప్రాంతాల్లో వర్షం పడితే రోడ్లు జలమయమవుతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం రోడ్డుకు ఇరువైపులా రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన సీసీ కాలువలు అక్కరకు రాకుండా పోయాయి. పట్టణంలో పెరిగిన జన సాంద్రతకు అనువుగా కాలువలు లేవు. మురుగునీరు పోవడానికి అవుట్‌లెట్ లేదు. ప్రభుత్వాలు మారినా ప్రజలకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాలతో పాటు ప్రధాన రహదారుల్లోనూ నీరు నిలిచిపోయింది. రెండు అడుగుల మేర రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో వాహన చోదకులు ఇబ్బందులకు గురయ్యారు.

అక్కరకు రాని ఆర్‌యూబీ

స్థానిక తాళ్లూరు రైల్వేగేటు వద్ద రూ.4.88 కోట్లతో నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వర్షం నీరు చేరడంతో వాహనాల రాక పోకలకు అంతరాయం కలిగింది. వారం రోజుల పాటు ఆర్‌యూబీని మూసి వేశారు. ఇందుకు ప్రధాన కారణం వర్షం నీరు అండర్ పాస్‌లోకి చేరితే పంపింగ్ చేసే విధానం లోపభూయిష్టంగా ఉంది. కొండలు, వాగుల నుంచి వర్షాకాలంలో పెద్ద ఎత్తున నీరు అండర్ బ్రిడ్జి ఉన్న ప్రాంతానికి వచ్చేది. వర్షం నీరు పోవడానికి కల్వర్టు ఉండేది. దీంతో వచ్చిన నీరు వచ్చినట్టే బయటకు వెళ్లిపోయేది. అండర్ బ్రిడ్జి నిర్మాణ విషయంలో రైల్వేశాఖ అధికారులు డిజైన్ రూపొందించడంలో విఫలమయ్యారు. నీరు పోవడానికి ప్రత్యేకమైన కాలువను గెల్లబీడు వరకు నిర్మిస్తేనే సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నారు.



ఇటీవల కురిసిన వర్షాలకు చెరువును తలపిస్తున్న తుని జీఎస్‌టీ రోడ్డు



తుని పట్టణశివారు జీడిపిక్కల ఫ్యాక్టరీ రోడ్డులో వర్షం నీరు.(ఫైల్)

కాలువల లెవెల్స్ సక్రమంగా లేవు

పట్టణంలోని నిర్మించిన సీసీ కాలువలు లెవెల్స్ సరిగా లేవు. దీంతో నీటి ప్రవాహనికి అంతరాయం కలుగుతోంది. స్టాటింగ్ పాయింట్ నుంచి అవుట్‌లెట్‌కు వెళ్లే సరికి 40 డిగ్రీలకు ఉండాలి. ఇలా ఎక్కడా లేకపోవడం, రోడ్లు పల్లంగా, కాలువలు ఎత్తుగా ఉండడంతో నీరు రోడ్లపై చేరుతోంది. దీంతో పాటు కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఇవి నీటి ప్రవాహానికి ఆటంకం కలిగిస్తున్నాయి. ప్రభుత్వం రోడ్లు, కాలువలు, అండర్ బ్రిడ్జిల విషయంలో నిపుణుల సలహాలను తీసుకుంటే సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

– ఎస్.సత్యనారాయణ, రిటైర్డ్ ఇంజనీర్, తుని